క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

టేక్మాల్(మెదక్): మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన కోడపాక కిషన్ కొద్దిరోజుల క్రితం నిమ్స్‌లో చికిత్స పొందాడు. విషయం తెలుసుకున్న అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పోతులబోగుడలోని తన స్వగృహంలోని గురువారం రూ.2లక్షల ఎల్‌ఓసీ చెక్కును కిషన్ తల్లి పెంటమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టేక్మాల్ మండల ప్రధాన కార్యదర్శి అవినాష్, ఈశ్వరప్ప, విఠల్, శాపొద్దిన్, రాజేశ్వర్‌గౌడ్, రవిశంకర్, నాగరాజు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం



ప్రవీణ్‌ను సన్మానిస్తున్న విజయ్‌కుమార్

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన ఒడ్డె ప్రవీణ్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం జెడ్పీటీసీ సభ్యుడు విజయ్‌కుమార్ శాలువాతో ప్రవీణ్‌ను సన్మానించారు. మంగిలిపల్లి నరేష్ కూడా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికకాగా, ఆయన్ను కూడా సన్మానించాడు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ నరసింహారెడ్డి, ఉపసర్పంచ్ తుమ్మల రమేష్, స్వామి, పోచయ్య, శ్రీనివాస్, కిష్టయ్య, స్వామి గౌడ్, చంద్రయ్య పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల అందజేత



కుట్టుమిషన్లు అందజేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని నవాబ్‌పేట ఫ్లెమింగ్ పరిశ్రమ తరఫున గ్రామంలోని 28 మంది మహిళలకు గురువారం కుట్టుమిషన్లు అందజేశారు. ఫ్యామిలీ ప్లానింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్‌లపై శిక్షణ పొందిన పేద మహిళలకు అందించిన సహకారం గొప్పదని సర్పంచ్ అశోక్‌రెడ్డి అన్నారు. ఫ్లెమింగ్ పరిశ్రమ ప్రతినిధులు శ్రీనివాస్, ప్రదీప్, మనోహర్‌లు మాట్లాడుతూ పరిశ్రమ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మ, ఉప సర్పంచ్ ప్రేమ్‌దాస్ తదితరులున్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



రేణుకామాతను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, తదితరులు

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లిలో గురువారం రేణుకా ఎల్లమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠాపన కనుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి , పాపన్నపేటజెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లప్ప, ఏడుపాయల మాజీ చైర్మన్ నర్సింలుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గోకని రాజు, ఎలందర్‌గౌడ్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భరత్ గౌడ్, గౌడ కులస్తులు తదితరులు హాజరయ్యారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



నర్సాపూర్‌లో పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్

నర్సాపూర్: పట్టణంలో సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ సూచించారు. గురువారం ఆయన పట్టణంలో పలు వార్డుల్లో పర్యటించారు. రోడ్ల పనులను పరిశీలించడంతో చేపట్టాల్సిన ఏరియాను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నిబంధనలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కమిషనర్ వెంకట్‌గోపాల్‌కు సూచించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

రోడ్డు ధ్వంసమై.. ముళ్లపొదలు కమ్మేసి





ఈ చిత్రంలో కనిపిస్తున్న దారి రంగంపేట తురకల చెరువుకట్ట మీదుగా సదాశివనగరం, కోనాపూర్, వై.మాందాపూర్‌కు వెళ్లే అంతర్గత రహదారి. ప్రస్తుతం ఈ రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. రోడ్డు ఇరువైపులా ముళ్లపొదలు కమ్ముకున్నాయి. ఈ దారిలో మూలమలుపులు ఎక్కువగా ఉండడంతో ప్రయాణికులకు ప్రయాణం ఇబ్బందికరంగా తయారైంది.

– కొల్చారం(నర్సాపూర్)

అనుమానితులుంటే సమాచారం ఇవ్వాలి



గ్రామస్తులకు సూచనలు చేస్తున్న పోలీసులు

మనోహరాబాద్(తూప్రాన్): ఎవరైనా అనుమానితులుంటే తమకు సమాచారం ఇవ్వాలని తూప్రాన్ సీఐ శ్రీధర్ అన్నారు. గురువారం మండలంలోని కూచారం గ్రామంలో వేకువజామున సీఐ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైనా ధ్రువీకరణ పత్రాలు లేని 45 బైక్‌లు, 7 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో శాంతి భద్రతలను కాపాడాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇళ్లు అద్దెకు ఇచ్చేటప్పుడు పూర్తి వివరాలు సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు సందీప్‌రెడ్డి, సంతోష్‌కుమార్, మహేందర్‌గౌడ్, రవికాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మక్కరాజీపేటలో గ్రామస్తుల వివరాలను సేకరిస్తున్న ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్

మక్కరాజీపేటలో

చేగుంట(తూప్రాన్): మండలపరిధిలోని మక్కరాజీపేటలో పోలీసుల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కమ్యూనిటీ కనెక్టివిటీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో పోలీసులు తిరిగారు. సరైన ధ్రువపత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మూఢనమ్మకాలు, డ్రైవింగ్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రతలపై వివరించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐలు ప్రకాశ్‌గౌడ్, సుభాష్‌గౌడ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



బీజేపీ జెండావిష్కరణలో నందు జనార్దన్‌రెడ్డి, తదితరులు

చిన్నశంకరంపేట(మెదక్): బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందు జనార్దన్‌రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అవినీతిపై పోరాడాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పట్లోరి పోగుల రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్‌గౌడ్, రాచర్ల అశోక్, మండల నాయకులు ధశరథం, వనం నర్సింహులు, రాజుయాదవ్, వెంకన్న, మంజుల తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు



దొంతి వద్ద ధర్నా చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న మహేష్‌గుప్తా



లింగారెడ్డిపేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద అధికారులు, రైతులు

కొనగోలు కేంద్రాల వద్ద లారీలు లేక ఎక్కడి బస్తాలు అక్కడే ఉన్నాయి. ఒక వైపు అకాల వర్షాలు పడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని పలు గ్రామాల రైతులు వేదన వ్యక్తం చేశారు.

లారీలులేక...

మనోహరాబాద్(తూప్రాన్):మనోహరాబాద్ మండలంలోని లింగారెడ్డిపేట్, పర్కిబండ, దండుపల్లి, రంగాయపల్లి కొనగోలు కేంద్రాలను గురువారం పలు శాఖల అధికారులు పరిశీలించారు. వీరిలో అదనపు డీఆర్డీఓ భీమయ్య, మండల ప్రత్యేక అధికారి కృష్ణమూర్తిలు వేర్వేరుగా కేంద్రాలను పరిశీలించారు. పర్కిబండ కేంద్రం వద్ద లారీలో ఎక్కించిన ధాన్యానికి తాడిపత్రి లేకపోవడంతో వర్షం పడి బస్తాలు తడిసిపోయాయి. ఈ ధాన్యాన్ని తీసుకోమని రైస్‌మిల్లర్ చెప్పగా, భీమయ్య అడిషనల్ కలెక్టర్‌తో మాట్లాడించి ధాన్యాన్ని రైస్‌మిల్లుకు తరలించేలా చేశారు. కాగా వర్షాలు పడే అవకాశం ఉండటంతో వెంటనే ధాన్యం కొనుగోలు చేపట్టి లారీలలో తరలించాలని నిర్వాహకులకు సూచించారు.

దొంతిలో రైతుల ధర్నా

శివ్వంపేట(నర్సాపూర్): తమ ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని మగ్ధూంపూర్ గ్రామ రైతులు ధాన్యంతో గురువారం తూప్రాన్-నర్సాపూర్ రోడ్డుపై పెట్టి ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న శివ్వంపేట్ జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా ధర్నా వద్దకు వెళ్లి రైతులను సముదాయించారు. వారి ధాన్యాన్ని కొనుగోలు చేయించేలా కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

ధాన్యం తరలించకుంటే నిరాహారదీక్ష చేస్తాం

కౌడిపల్లి(నర్సాపూర్): కొనుగోలు కేంద్రం వద్దకు లారీలు రాక తీవ్ర ఇబ్బందులు పడతున్నామని, ధాన్యం తరలించకపోతే నిరాహార దీక్ష చేస్తామని రైతులు హెచ్చరించారు. గురువారం మండలంలోని కూకుట్లపల్లి గ్రామ రైతులు డిప్యూటీ తహసీల్దార్ తారాబాయికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ మాజీ డైరెక్టర్ బట్టయ్య తదితరులు మాట్లాడుతూ గ్రామంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 25రోజులు అవుతుండగా, కేవలం నాలుగు లారీల ధాన్యం మాత్రమే తరలించారన్నారు. లారీల కొరతతో ధాన్యం తూకం వేయడం లేదని, తూకం వేసిన ధాన్యం అక్కడే ఉందన్నారు. ప్రతిరోజు రైతులు ధాన్యం కేంద్రం వద్ద లారీల కోసం పడిగాపులు కాస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో రైతులు లక్ష్మీనారాయణ, కుమార్ తదితరులు ఉన్నారు.

పీపుల్స్ మార్చ్‌కు కాంగ్రెస్ నేతలు

మెదక్‌జోన్: జడ్చర్లలో జరిగిన కాంగ్రెస్ పార్టీ పీపుల్స్ మార్చ్ సభకు గురువారం మెదక్ కాంగ్రెస్ నేతలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా టీపీసీసీ నేతలు చౌదరి సుప్రభాత రావు, మ్యాడం బాలకృష్ణలు మాట్లాడుతూ తెలంగాణలో రాబోయేది ఇందిరమ్మ రాజ్యమేనన్నారు. వెళ్లిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, నార్సింగి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గోవర్ధన్, చిన్న శంకరంపేట వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీలు శివకుమార్, ప్రసాద్, గోండ స్వామి, కాంగ్రెస్ నేతలు మహమ్మద్ అక్బర్, బురుగుపల్లి వెంకటరాములు, డాకిస్వామి, రాజుపేట రవీందర్‌గౌడ్, నాగిరెడ్డి, అల్లాడి వెంకటేష్, శ్రీకాంత్ రెడ్డి, సల్మాన్ తదితరులు ఉన్నారు.



తెలంగాణలో బీజేపీ నాటకాలు సాగవు



ప్రమోద్ తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫారూఖ్

దుబ్బాకటౌన్: తెలంగాణలో ఎన్ని కపట నాటకాలు ఆడినా బీజేపీని ప్రజలు నమ్మరని మళ్లీ మూడోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్సేనని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ మండలంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎన్నో హామీలు ఇచ్చి ఉప ఎన్నికల్లో గెలిచిన రఘునందన్‌రావు దుబ్బాక నియోజకవర్గంలో ఏం చేసిండో ప్రజలు స్వయంగా చూస్తున్నారన్నారు. రైలు తేలే..రైతులకు ఎడ్లు నాగలియ్యలే, నిరుద్యోగ భృతి లేదు, ఆసుపత్రి లేదు నయా పైస తెచ్చి అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. దుబ్బాక నియోజకవర్గంలో మళ్లీ రఘునందన్‌రావును ప్రజలు నమ్మే స్థితిలో లేరని తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఈ సందర్భంగా భరోసానిచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, జిల్లా ఇంచార్జి వెంకటేశ్వర్లు, యువజన విభాగం సోలిపేట సతీష్‌రెడ్డిలు మాట్లాడారు. ఉద్యమంలో అమరుడైన ప్రమోద్ తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

◆ **బాధిత కుటుంబానికి పరామర్శ**

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడకు చెందిన మంగలిపల్లి నరేష్(20) ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు విజయకుమార్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మృతిని తండ్రికి రూ. 5వేలు ఆర్థికసాయం అందజేశారు.

◆ **మోడల్ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం**

పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో అడ్మిషన్లకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలో చేరేందుకు ఈనెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశముందన్నారు.

◆ **ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు**

కౌడిపల్లి(నర్సాపూర్): రోహిణి కార్తె సందర్భంగా గురువారం మండలంలోని కొట్టాల గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. పురోహితుడు ఉమాశంకరశర్మ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి చందన అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

◆ **నేడు మండల బీజేపీ కార్యవర్గ సమావేశం**

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఆయా గ్రామాల బూత్‌కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, మోర్చాల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, మండల నాయకులు హాజరుకావాలన్నారు.

◆ **రుతుప్రేమపై అవగాహన కలిగి ఉండాలి**

జగదేవ్‌పూర్(గజ్వేల్): రుతుప్రేమపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని డీపీఓ దేవకీదేవి, ఎస్‌డబ్ల్యూఆర్‌టీ వాలంటీర్ డా.శాంతి అన్నారు. గురువారం కాశిరెడ్డిపల్లి గ్రామంలో రుతుప్రేమపై అవగాహన సదస్సు నిర్వహించారు.

రిటైర్డ్ ఉద్యోగుల భవన నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, తదితరులు

నర్సాపూర్: ఉద్యోగులు, రాజకీయ నాయకులకు రి టైర్‌మెంట్ ఉంటుందని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్ మండల స్థాయి రిటైర్‌మెంట్ ఉద్యోగుల భవన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసిన అనంతరం మాట్లాడారు. ఉద్యోగవిరమణ పొందిన వారికి మంచి ఆఫీసు అవసరమని భావించానని, వారికి ఆఫీసు భవనం నిర్మించాలని నిర్ణయించినట్టు తెలిపారు. అందుకు గాను రూ.15లక్షలు మంజూరు చేశానని, త్వరలోనే భవన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. రిటైర్డు ఉద్యోగుల సలహాలు, సూచనలు రాష్ట్రానికి, నియోజకవర్గానికి ఎంతో అవసరమని, వారి సూచనలు స్వీకరిస్తూ ముందుకెళతానన్నారు. కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సత్యనారాయణ, యాకూబ్, జహీర్, మాణయ్య, జెడ్పీటీసీ బబియానాయక్ పాల్గొన్నారు.

60వ రోజుకు చేరుకున్న దీక్షలు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ కోసం రామాయంపేటలో నిర్వహిస్తున్న దీక్షలు గురువారం నాటికి 60వ రోజుకు చేరుకున్నాయి. అఖిల పక్షం ఆధ్వర్యంలో ఈ దీక్షలు కొనసాగుతున్నాయి. త్వరలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార పార్టీ ముందస్తుగా డివిజన్ ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రభుత్వం పట్టించుకోకపోతే అధికార పార్టీ నాయకులను రోడ్లపై తిరగనివ్వమని, వారికి ఓట్లు వేయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అఖిలపక్షం ప్రతినిధులతో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



దీక్షలో నేతలు

ఎంసెట్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

నర్సాపూర్: ఎంసెట్ ఫలితాల్లో తమ కాలేజీకి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారని అల్లూరి సీతరామరాజు గిరిజన గురుకుల కాలేజీ ప్రిన్సిపాల్ భిక్షమయ్య తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో కాలేజీకి చెందిన వీరన్న 83మార్కులతో 5521 ర్యాంకు, మహేష్ 61మార్కులు సాధించి 22,602 ర్యాంకు సాధించాడన్నారు. అగ్రికల్చరల్ విభాగంలో విశాల్ 72మార్కులతో 12,644 ర్యాంకు, నితిన్ 57మార్కులతో 27727 ర్యాంకు సాధించాడన్నారు. రెండు విభాగాల్లో తమ కాలేజీ నుంచి 66 మంది పరీక్ష రాసి మంచి ఫలితాలు సాధించారన్నారు. గురుకులాల రీజనల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్, కాలేజీ లెక్చరర్లు కల్యాణి, వెంకటయ్య, సుదేంద్ర, లక్ష్మయ్య తదితరులు విద్యార్థులను అభినందించారు.

రామాయాంపేటలో...

రామాయంపేట(మెదక్): రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి శివశంకర్ ఎంసెట్‌లో 16131 ర్యాంక్ సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి తెలిపారు. ఒకేషనల్ విభాగంలో ఎలక్ట్రికల్ కోర్సు అభ్యసించిన శివశంకర్ ర్యాంక్ సాధించడం తమ కళాశాలకు గర్వకారణమన్నారు.

అధికారులను అడ్డుకున్న తండావాసులు

శివ్వంపేట(నర్సాపూర్): బాల్య వివాహం జరుగుతుందున్న సమాచారంతో అక్కడకు చేరుకున్న అధికారులను తండావాసులు అడ్డుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోజ్యాతండా గ్రామ పంచాయతీ పరిధిలో బాల్య వివాహం జరుగుతుందన్న సమాచారంతో బుధవారం డీసీపీఓ కరుణశీల తన సిబ్బందితో కలిసి తండాకు వెళ్లగా గ్రామస్తులు అడ్డుకున్నారు. అనంతరం అక్కడి నుంచి బాలికను బంధువులతో పంపించారు. ఈ విషయమై కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు అధికారులు తెలిపారు. తిరిగి గురువారం తండాకు వెళ్లగా ఇళ్లకు తాళాలు వేసి ఉన్నాయన్నారు. బాలికను కుటుంబ సభ్యులు తీసుకుని గ్రామం నుంచి వెళ్లిపోయినట్లు గుర్తించారు.

పెద్దమ్మ తల్లి దర్శనం కలగడం అదృష్టం

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): పెద్దమ్మ తల్లి దర్శనం కలగడం అదృష్టంగా భావిస్తున్నామని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణోత్సవంలో గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవం పెద్దమ్మ పెద్దిరాజులన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు జిగ్ర రాజు, మంద శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, అహ్మద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

అలరించిన ‘అటరాక్సియా’



పుస్తకావిష్కరణలో సాగి సుధీర్‌కుమార్, ప్రజాకవి జయరాజ్, ఆర్పీఓ ప్రభాకర్, తదితరులు

ఘనంగా వర్గల్ పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

వర్గల్(గజ్వేల్): కళాశాల వార్షికోత్సవం సందర్భంగా క్లాసికల్ నృత్యాలు, సోలో, గ్రూపు డ్యాన్సులు ఉర్రూతలూగించాయి. వర్గల్ జ్యోతిబాపూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాల వేదికగా బుధవారం రాత్రి ‘అటరాక్సియా’ పేరిట ఎనిమిదో వార్షికోత్సవ వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించారు. తాము చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ తీసిపోమన్నట్లు విద్యార్థినులు చక్కని ప్రదర్శనలతో ఆహుతులను అలరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సాగి సుధీర్‌కుమార్, ప్రజాకవి జయరాజ్, సంగీత దర్శకుడు బలేపల్లి మోహన్, ఆర్సీఓ ప్రభాకర్, వీపీ గోవిందరావు, ఏటీపీ వరలక్ష్మి, డాక్టర్ జానకి పాల్గొన్నారు.



విద్యార్థినుల నృత్యం

ఈ సందర్భంగా ప్రొఫెసర్ సాగి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ మీపై మీరు నమ్మకం కోల్పోకుండా ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. అతిథులు కళాశాల వార్షిక సంచిక ‘కవనం’ను ఆవిష్కరించారు. కళాశాల వీపీ గోవిందరావు రచించిన ‘వేదిక్ సైన్స్’ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో స్నాతకోత్సవ విద్యకు ఎంపికైన విద్యార్థినులకు రూ.10,000 చొప్పున నగదు పారితోషికం అందజేశారు.